

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత: ఎమ్మెల్యే

ఉట్నూర్, మే31: ఆధ్యాత్మికతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండలకేంద్రంలోని వేణునగర్ కాలనీలోని హనుమాన్ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



కౌంట్‌డౌన్ షురూ!



- లోక్‌సభ ఎన్నికల ఫలితాలకు మిగిలింది మూడు రోజులే..
- సమయం దగ్గర పడడంతో అభ్యర్థుల్లో మొదలైన హైటెన్షన్
- గెలుపుపై రాజకీయ వర్గాల్లో నెలకొన్న ఉత్కంఠ
- ఏర్పాట్లను సిద్ధం చేస్తున్న అధికార యంత్రాంగం

ఆదిలాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్న లోక్‌సభ ఎన్నికల ఫలితాలకు నేటితో కౌంట్‌డౌన్ మొదలయ్యింది. అభ్యర్థుల భవితవ్యం మరో మూడు రోజుల్లోనే తేలి పోనుంది. ఈనెల 4న లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగనుంది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీటీడీసీ కార్యాలయం, పాలిటెక్నిక్ కళాశాల, సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల ఆవరణలో ఓట్ల లెక్కింపును చేపట్టనున్నారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాలకు వేరు వేరుగా కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. మే 13న ఎన్నికలు ముగియడంతో 22 రోజుల నిరీక్షణకు త్వరలోనే తెరపడనుంది. ఫలితాల సమయం దగ్గర పడుతున్న కొద్ది అభ్యర్థుల్లో హైటెన్షన్ కనిపిస్తుంది. ఎవరికి వారే ధీమాతో ఉన్న ఓటర్లు మాత్రం ఎవరికి పట్టం కడుతారోనన్న ఆందోళన వెంటాడుతుంది. ఈసారి లోక్‌సభ బరిలో 12 మంది అభ్యర్థులు నిలిచిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆత్రంసక్కు, కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రంసుగుణ, బీజేపీ అభ్యర్థి గోడంనగేష్‌ల మధ్యనే ప్రధాన పోటీ అన్నట్లుగా కనిపిస్తుంది. ఎన్నికలు జరిగిన సరళి ని బట్టి చూస్తే ఈ ముగ్గురు అభ్యర్థుల మధ్యనే గట్టి పోటీ ఉన్నట్లు తెలుస్తుంది. పార్లమెంట్ పరిధిలో 16 లక్షల 50వేల 175మంది ఓటర్లు ఉండగా ఇందులో 12లక్షల 21వేల 563 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. దీంతో 74.03 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా రైతులు, మహిళలు, యువత ఎవరి వైపు మొగ్గు చూపుతారో వారిదే గెలుపు ఖాయమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కౌంటింగ్ కేంద్రాల్లోకి సమర్థవంతమైన నేతలను పంపేందుకు ప్రధాన పార్టీల ఎంపీ అభ్యర్థులు కసరత్తు చేస్తున్నారు. అభ్యర్థుల గెలుపు పై నేతలు ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్న చివరికి గెలిచేది ఎవరన్నదే ప్రశ్నార్థకంగా మారింది.

గెలుపుపై ఊగిసలాట

అన్ని పార్టీలు అభ్యర్థుల గెలుపుపై ధీమాతో కనిపిస్తున్నాయి. అయితే పోలింగ్ సరళిపై వివిధ రకాల ప్రచారం జరుగడంతో కొంత ఊగిసలాటే కనిపిస్తోంది. అసలు గెలుస్తామా లేదా అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొన్న ఫలితాలు ఎలా ఉంటాయోనని అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు. పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాల వారీగా పోలైనఓట్ల వివరాలతో లెక్కలు వేసుకుంటూ ఓ అంచనాకు వస్తున్నారు. ఏదైనా తేడా వస్తే మళ్లీ పోలింగ్ సరళిపై తమ పార్టీ నేతలతో చర్చిస్తున్నారు. అనుకున్న స్థాయిలో ఓట్లు పడ్డాయా లేదా అని ఆరా తీస్తున్నారు. సొంతపార్టీ నేతలే రోజుకో విధంగా సమాచారం ఇవ్వడంతో గెలుపు అంచనాలు మారి పోతున్నాయని అభ్యర్థులు చెబుతున్నారు. పార్లమెంట్ పరిధిలో ఆదివాసీ గిరిజనుల ఓట్లను ముగ్గురు అభ్యర్థులు సమానంగా దక్కించుకున్న గిరిజనేతర ఓటర్లేకీలకం కానున్నారు. ప్రధానపార్టీల అభ్యర్థులంతా తమ క్యాడర్‌నే నమ్ముకున్న తటస్థ ఓటర్లు మాత్రం ఎవరికి జైకొడుతారో అర్థంకాని పరిస్థితి ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఓట్ల చీలిక ఎవరికి అనుకూలమో..

మొదటి నుంచి ప్రధాన పార్టీల మధ్య తీవ్రమైన పోటీ కనిపించింది. పోలింగ్ సమయం దగ్గర పడ్డా కొద్ది కాంగ్రెస్, బీజేపీ పార్టీల మధ్యనే ప్రధాన పోటీ ఉందన్న ప్రచారం జరిగింది. పోలింగ్ రోజు బీఆర్ఎస్ ఓటు బ్యాంకు చీలడంతో ఎవరికి అనుకూలంగా మారిందోనన్న ఉత్కంఠ కనిపిస్తోంది. మొదట కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వినిపించిన చివరకు బీజేపీ అనూహ్యంగా పుంజుకోవడంతో ఏం జరుగుతుందోనన్న భయం వెంటాడుతుంది. త్రిముఖ పోటీలో కాంగ్రెస్‌కు గెలిచే అవకాశాలు లేక పోలేదన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఆదివాసీ ఓట్లలో భారీగా చీలిక వస్తే కాంగ్రెస్ విజయ అవకాశాలు మెరుగు పడినట్లేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మహిళలు, యువత ఓట్లతో బీజేపీ కొంత పుంజుకోవడంతో అందరి అంచనాలు తారు మారయ్యే అవకాశాలు ఉన్నాయి. మొత్తానికి ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తాడో ఇప్పుడే స్పష్టంగా చెప్పలేమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మూడు ప్రధాన పార్టీలకు బలమైన క్యాడర్ ఉండడంతో అభ్యర్థులంతా గెలుపు ధీమాతోనే కనిపిస్తున్నారు.

పార్లమెంట్ పరిధిలో ఓట్ల లెక్కింపు ఇలా..

నియోజక వర్గం	రౌండ్లు	లెక్కింపు ఓట్లు
సిర్పూర్	23	163944
ఆసిఫాబాద్	26	171511
బోథ్	22	165157
ఆదిలాబాద్	21	181136
ఖానాపూర్	22	162101
నిర్మల్	22	185168
ముథోల్	23	192546

12లక్షల 21వేల 563 ఓట్ల లెక్కింపు

మే13న జరిగిన లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లను సిద్ధం చేస్తుంది. ఈ నెల 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేస్తోంది. కౌంటింగ్‌కు సమయం దగ్గర పడడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కేంద్రంలోని కౌంటింగ్ కేంద్రం నెం.1 సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజక వర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపును చేపట్టనున్నారు. అలాగే కౌంటింగ్ కేంద్రం -2 టీటీడీసీ కార్యాలయ ఆవరణలో ఆదిలాబాద్, బోథ్, కౌటింగ్ కేంద్రం -3లో నిర్మల్, ఖానాపూర్ ముథోల్ నియోజక వర్గాల ఓట్ల లెక్కింపుకు ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. ఓట్ల లెక్కింపును సజావుగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని కూడా పూర్తిచేశారు. జూన్ 4న ఉదయమే పార్టీల కౌంటింగ్ ఏజెంట్ల ముందు స్ట్రాంగ్ రూమ్‌లను తెరవనున్నారు. గతంలో మాదిరిగానే 14 టేబుళ్లపై 159 రౌండ్లలో ఓట్ల లెక్కింపును పూర్తి చేసేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్లతో పాటు ఎస్పీలు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

సంక్షిప్త సమాచారం



విత్తన దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్‌ల రద్దు

తాంసి, మే31: విత్తనం, ఎరువుల దుకాణ దారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని తహసీల్దార్ లక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని పోన్నారి, బండల నాగపూర్, కప్పర్ల గ్రామాలలోని మందులు, ఎరువులు, విత్తనాల దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటివరకు ఎన్ని విత్తనాలు అమ్మినారో వివరాలు తెలుసుకున్నారు. దుకాణాల్లో ఎలాంటి విత్తనాలు ఉన్నాయో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని ఆదేశించారు. ముఖ్యంగా రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వారికి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు పురుగు మందులు, విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో, తదితరులు ఉన్నారు.

వడదెబ్బతో యువకుడి మృతి

ఉట్నూర్, మే31: మండలంలోని గోండు కొత్తగూడ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న నాగోబా గూడాకు చెందిన గిరిజన యువకుడు ఆత్రం లింబారావు(23) శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మూడు రోజుల క్రితం ఆత్రం భుజంగ్‌రావు కుమారుడు లింబారావు వడదెబ్బకు గురికావడంతో ఉట్నూర్‌లోని జిల్లా కేంద్ర ఆసుపత్రిలో వైద్యం అందించి మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. అక్కడ వైద్యం అందుకుంటుండగా మరింత పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి హైదరాబాద్ తరలిస్తుండగా శుక్రవారం ఉదయం మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలియడంతో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుతో పాటు కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రంసుగుణ, నాగబాబు కూడా సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అక్రల నిల్వల అడ్డుకట్టకు ప్రత్యేక బృందాలు





విత్తన గోడౌన్‌లను పరిశీలిస్తున్న ఎస్పీ గౌస్‌ఆలం

- జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం
- విత్తన గోడౌన్‌ల తనిఖీ

ఆదిలాబాద్ అర్బన్, మే31: విత్తనాల అక్రమ రవాణాలను, అక్రమ నిల్వలను అడ్డుకో వడానికి జిల్లావ్యాప్తంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తూ ఆకస్మీకంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. శుక్రవారం అక్రమ రవాణా జరుగకుండా పట్టణంలోని విత్తన గోడౌన్‌లను పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో కలిసి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విత్తనాల అక్రమ రవాణాను అడ్డుకోవడానికి, అక్రమ నిలువలు జరుగకుండా అడ్డుకోవడానికి రెవెన్యూ, పోలీసు అధికారులచే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా 36 విత్తన గోడౌన్స్ వద్ద అధికారులను ఏర్పాటు చేయడం జరిగిం దని తెలిపారు. పట్టణంలోని పలు గోడౌన్స్‌ను పరిశీలించి విత్తనాల రాకపోకలను తనిఖీ చేశారు. ప్రధానంగా గోడౌన్స్‌లో ఎటువంటి నకిలీ విత్తనాలు లేకుండా విత్తన సంచులను పరిశీలించి తనిఖీ చేశారు. గోడం సిబ్బందితో మాట్లాడుతూ నిలువలు ప్రతి ఒక్క రాకపోకలను, సమయం, తేదీ, పేరుతో నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో నకిలీ విత్తనాలను పూర్తిగా అడ్డుకోవడానికి మండలాల వారీగా వ్యవసాయ అధికారులతో కలిసి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి ఆకస్మీక తనిఖీలను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా మహారాష్ట్ర నుంచి నకిలీ విత్తనాల అక్రమ రవాణా జరుగకుండా శంకర్‌గూడ, ఆనంద్‌పూర్, పిప్పర్‌వాడ, లక్ష్మీపూర్, ఘన్పూర్‌వద్ద చెక్ పోస్టును ఏర్పాటు చేసి ప్రతీ వాహనాన్ని క్షుణంగా తనిఖీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. నకిలీ విత్తనాల అడ్డుకట్టకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ నకిలీ విత్తన వ్యాప్తిని అడ్డుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు, రైతులు అక్రమ నిల్వల పై, రవాణా పై, నకిలీ విత్తన తయారీపై ఎటువంటి సమాచారాన్ని అయిన జిల్లా పోలీసులకు తెలపాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆదిలాబాద్ ఎల్.జీవన్ రెడ్డి, ఒకటవ పట్టణ సీఐ కే.సత్య నారాయణ, రెండవ పట్టణ సీఐ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

నియమ నిబంధనల ప్రకారం కౌంటింగ్ ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ రాజార్షిషా

ఆదిలాబాద్‌అర్బన్, మే31: ఈనెల 4న నిర్వహించనున్న లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాలోని టీటీడీసీ, సోషల్ వెల్ఫేర్‌స్కూల్, సంజయ్‌గాంధీ పాల్‌టెక్నికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్‌కేంద్రాల ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారిరాజార్షిషా, ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ గౌస్‌ఆలంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 4న పార్లమెంట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఈసీఐ నియమ నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారం కౌంటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి జూన్4న ఆదిలాబాద్ జిల్లాలోని కౌంటింగ్ కేంద్రాలలో



కౌంటింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

కొనసాగే కౌంటింగ్ ప్రక్రియలో ఎక్కడ కూడా పొరపాట్లకు తావ్వికుండా, ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా అనుసరించాలన్నారు.కౌంటింగ్‌లో ఎలాంటి జాప్యం లేకుండా సమన్వయంతో పనిచేయాలని, కౌంటింగ్ కేంద్రాల వద్ద సంబంధిత ఏఆర్వోలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో గట్టి బందోబస్తుతోపాటు బారికెడ్స్, ఎన్నికల కౌంటింగ్‌కు వచ్చే అధికారులు, సిబ్బందికి మౌళిక వసతులు కల్పించాలని, తాగునీరు, టాయిలెట్స్, వైద్య సిబ్బంది మెడికల్ కిట్‌తో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద రౌండ్ దిక్లాక్, మూడంచెల పటిష్ఠ భద్రత, సీసీ కెమెరాల పర్యవేక్షణపై ఆరాతీశారు. అనంతరం సీఆర్‌పీఎఫ్ భద్రత సిబ్బంది వద్ద ఉన్న విజిట్ బుక్‌లో సంతకం చేశారు. ఇందులో సహాయ రిటర్నింగ్ అధికారి ఖుష్బుగుప్తా, అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, దీపక్‌తివారి, వేణు, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్

ఉట్నూర్, మే31: పట్టణంలోని పలు కాలనీలలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ పట్టణంలోని బోయవాడ, ఎన్టీఆర్‌కాలనీ, హనుమాన్‌నగర్, మేదరివాడ,మోబిన్‌పురా కాలనీల్లో శుక్రవారం కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలలో ప్రధానంగా నీటి, డ్రైనేజీ, రోడ్లు, కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలను గుర్తించడం జరిగిందని, ఈ సమస్యలన్నింటిని త్వరలో పరిష్కరిస్తామన్నారు.రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. అనంతరం పలువురి ని పరామర్శించి ఆరోగ్య భాగోగులను అడిగి తెలుసుకున్నారు.

నేడు జిల్లాకు రానున్న రాశి-659 పత్తి విత్తనాలు

ఆదిలాబాద్, మే31(ఆంధ్రజ్యోతి) జిల్లాలో రాశి - 659 పత్తి విత్తనాల కోసం భారీడిమాండ్ ఏర్పడడంతో ఆ రకం విత్తనాలను జిల్లాకు సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు మొదలు పెట్టింది. శనివారం జిలాకు రాశి -659 విత్తనాలను సరఫరా చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే విత్తన కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది. జిల్లాకు సుమారుగా 80వేల విత్తన ప్యాకెట్లు సరఫరా చేసేందుకు సంబంధిత కంపెనీ యజమాన్యం కూడా ఒప్పుకున్నట్లు సమాచారం. దీంతో జిల్లా కేంద్రానికి రాశి -659 విత్తనాలు శనివారం ఉదయమే రానున్నట్లు తెలుస్తోంది. ప్రత్యేక కౌంటర్ల ద్వారా రైతులకు పత్తి విత్తనాలను సరఫరా చేసేందుకు సిద్ధమవుతున్నారు. అనుకున్నట్లుగానే 80వేల పత్తి విత్తనప్యాకెట్లను ప్రభుత్వం జిల్లాకు సరఫరాచేస్తే విత్తనాల కొరత తీరనుందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నాయి.


ప్రభుత్వాన్ని బదనం చేయడానికే విత్తనంపై రాజకీయం



వ్యాపారులు, రైతులతో మాట్లాడుతున్న అన్వేశ్‌రెడ్డి

- కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేశ్‌రెడ్డి

ఆదిలాబాద్, మే31 (ఆంధ్రజ్యోతి): సరిపడ విత్తనాలు అందుబాటులో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని బదనం చేసేందుకే ప్రతిపక్షాలు విత్తన రాజకీయం చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజార్షిషాను కలిసి మాట్లాడారు.అనంతరం ఆయా విత్తన దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కోరుకునే విధంగా అన్ని రకాల కంపెనీల విత్తనాలను అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. రైతులెవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఒకే రకం విత్తనాలను రైతులు కోరుకోవడంతో కొంత ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇతర రకాల విత్తనాల పై అధికారులు అవగాహన కల్పించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. కాని ప్రతిపక్షాలు అనవసరంగా రాద్ధాంతం చేస్తూ రైతులను రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు రైతులతో రాజకీయం చేయడం మానుకోవాలని హెచ్చరించారు. ఇందులో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, మల్లేష్, వెంకట్‌రెడ్డి, కొండగంగాధర్, రాములు, గిమ్మసంతోష్, సామరూపేష్ రెడ్డి తదితరులున్నారు.



ఆట పాటలతో విద్యనందించాలి

● శిక్షణ శిబిరాన్ని సందర్శించిన ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా

ఉట్నూర్, మే31: భారత్‌దేఖో స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉట్నూర్ కేబీ ప్రాంగణంలో వికాసం ప్రత్యేక పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా శుక్రవారం సందర్శించారు. ప్రతీ రోజు పిల్లలకు ఆట పాటలతో పెయింటింగ్, డ్రాయింగ్ శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు మెను ప్రకారం భోజనం అందజేయాలని ప్రతీ రోజు పిల్లలకు ఉదయం పాలు బిస్కెట్లు, పండ్లు అందజేయాలన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వికాసం పాఠశాల ప్రిన్సిపల్ వికాస్, ఎస్సీఈఆర్పీ బలరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను సకాలంలో చెల్లించాలి

● ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ సత్యం

ఖానాపూర్, మే 31 : ఇంటి పన్నులను సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ సత్యం ప్రజలను కోరారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన మున్సిపల్ పన్నుల వసూలు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇంటి పన్నులు వసూలు చేసేందుకు ప్రజలు ఇంటి వద్దకు వస్తున్న మున్సిపల్ సిబ్బందికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అంతకముందు పట్టణంలోని ఐదవ వార్డులో నెలకొన్న త్రాగునీటి సమస్యను పరిష్కరించేందుకు మున్సిపల్ సిబ్బంది చేపట్టిన పనులను పరిశీలించారు. వార్డు ప్రజలు త్రాగునీటి సమస్య ఉన్నట్లు చైర్మన్ దృష్టికి తీసుకురావడంతో నూతన బోరు మోటార్‌ను ఏర్పాటు చేసి నెలకొన్న త్రాగునీటి సమస్యను పరిష్కరించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ వేరువేరు కార్యక్రమాలలో మున్సిపల్ వైస్ చైర్మన్ సంతోష్, కాంగ్రెస్ నాయకులు పరిమి సురేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు

● సరిపడా విత్తన నిల్వలున్నాయి..
● ఆదిలాబాద్ కలెక్టర్ రాజార్షిషా

ఆదిలాబాద్ అర్బన్, మే31: రైతులు ఆందోళన చెందవద్దని, సరిపడా విత్తన నిల్వలున్నాయని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. శుక్రవారం వారం ఆయన జిల్లాలో విత్తనాల దుకాణాలు, గోదాం, అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ ద్వారా చేపడుతున్న నిర్మాణ పనుల తీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మొదటగా అంబేద్కర్ చౌరస్తాలోని శ్రీనివాస విత్తన దుకాణంలో, భుక్తాపూర్ దేశ్‌ముక్ విత్తనాల గోదాంలో ఉన్న విత్తనాల బ్యాగులను, రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సీజన్ వానకాలం పంటకు విత్తనాల నిలువలు సరిపడా ఉన్నాయని, రైతులు ఆందోళన చెందవద్దని, గత యేడాది కంటే ఈ యేడాది విత్తన నిల్వలు ఎక్కువగా ఉన్నాయని, జూన్ మొదటి వారంలోపే మిగితా విత్తనాలు, రైతులకు అందుబాటులో ఉంటాయని అన్నారు. పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారన్నారు. విత్తనాల దుకాణాలు ఉదయం 7గంటలకు తెరవాలని, ఉదయం నుంచే రైతులు షాపుల వద్ద బారులు తీరుతున్నారని, ఇది దృష్టిలో ఉంచుకొని షాపు యజమానులు త్వరగా షాపులు తెరచి విత్తనాలను అందించాలని సూచించారు. అనంతరం షాపులలో, గోదాముల్లో ఉన్న విత్తన నిల్వలను పరిశీలించారు. రైతులు ఒకే రకం విత్తనాలు కొనుగోలు చేయకుండా మిగితా రకాల విత్తనాలను కూడా కొనాలని కోరారు. నకిలీ విత్తనాలను అరికట్టడానికి, నకిలీ విత్తనాలు అమ్మే వాళ్ల పై ఉక్కుపాదం మోపడానికి క్షేత్ర స్థాయిలో పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులతో కూడిన టీంలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆథరైజ్డ్ డీలర్ల వద్ద కాకుండా బయట విత్తనాలు కొని రైతులు మోసపోవద్దని కోరారు. డీలర్లు రైతులను తప్పుతోవ పట్టిస్తే, లూజు విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు అమ్ముతున్న వారి పై పీడీ యాక్ట్ నమోదు చేసి విత్తనాలను సీజ్ చేయడం జరుగు తుందని తెలిపారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, సిబ్బంది ఉన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రాజార్షిషా

భైంసాలో అడిషనల్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

భైంసా, మే 31 : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో శుక్రవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజన్ అహ్మద్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.జిల్లా కేంద్రం నుంచి ఇక్కడకు వచ్చిన ఆయన కుంట ఏరియా, మదీన కాలనీల పరిధిలో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కొనసాగుతున్న ప్రగతి పనులను పర్యవేక్షించారు. ఈ నెల 5 లోపు పాఠశాలల్లో చేపడుతున్న మరుగుదొడ్లు,మూత్రశాలల నిర్మాణపు పనులతో పాటు నీటి వ్యవస్థ ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో ఎంత మాత్రం నాణ్యత లోపించిన సహించబోమన్నారు. అనంతర కుంట ఏరియా కొనసాగుతున్న షాదిఖానా పనులను పరిశీలించి నాణ్యత ప్రమాణాలతో గడువులోగా నిర్మాణపు పనులను చేపట్టాలని సూచించారు. అనంతరం కుంట ఏరియాలోని అర్బన్ పీహెచ్‌సీలో తనిఖీలు చేపట్టారు. ఆసుపత్రి నిర్వాహణ వ్యవస్థను పరిశీలించారు. అక్కడికి వచ్చిన రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో అరంభమవుతున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశమున్న దృష్ట్యా వైద్యాధికారులు, సిబ్బంది అన్ని వేళల అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా వైద్య సేవలు అందించాలన్నారు. అడిషనల్ కలెక్టర్ వెంట మండల ప్రత్యేకాధికారి మహ్మద్ మోజమ్ హుస్సేన్, మండల విద్యాధికారి సుభాష్‌తో పాటు పలువురు అధికారులు ఉన్నారు.


మదీనా కాలనీలో పర్యటిస్తున్న అడిషనల్ కలెక్టర్













నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిర్మల్ కల్చరల్, మే 31 : నిర్మల్ పట్టణం విశ్వనాథ్‌పేట్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8:30 నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ మార్కెట్, మోచిగల్లీ, బుధవార్‌పేట్, గాంధీ చౌక్, కబుతర్ కమాన్, బంగల్‌పేట్, నాయుడివాడ, రామారావు బాగ్, సాయిబాబా టెంపుల్, విశ్వనాథ్‌పేట్, వైఎస్ఆర్ కాలనీ, గాజులపేట్, డాక్టర్స్‌లేన్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని తెలిపారు.



నిర్మల్‌లో తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్

నకిలీ విత్తనాలను అడ్డుకునేందుకు ఇన్‌ఫార్మర్లు!

- రంగంలోకి పోలీసు శాఖ
- నిఘా కోసం స్పెషల్ టీమ్‌లు
- పోలీస్ స్టేషన్ పరిధిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు
- టెక్నాలజీ వినియోగంతో అడ్డుకట్ట
- బార్డర్లపై స్పెషల్ చెక్‌పోస్టులు

నిర్మల్, మే 31 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలో నకిలీ విత్తనాల నిరోధానికి పోలీసుశాఖ వినూత్న చర్యలకు శ్రీకారం చుడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం నకిలీ విత్తనాలను అరికట్టే బాధ్యతను వ్యవసాయ శాఖతోపాటు పోలీసు శాఖకు కూడా అప్పజెప్పడంతో ఈ బాధ్యతను పోలీసుశాఖ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. ప్రతియేటా నిర్మల్ జిల్లాలో నకిలీ విత్తనాల కారణంగా రైతులు పెద్ద ఎత్తున నష్టపోతున్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా మహారాష్ట్ర సరిహద్దున జిల్లా ఉండడంతో అక్కడ నుంచి అక్రమమార్గాలలో పెద్దఎత్తున నకిలీ విత్తనాలు దిగుమతి అవుతున్నట్లు ఫిర్యాదులున్నాయి. సరిహద్దులలో సరైన నిఘా లేకపోవడం అలాగే అధికారుల నిర్లక్ష్యం కారణంగా విచ్చల విడిగా నకిలీ విత్తనాలు జిల్లాకు దిగుమతి అవుతున్నట్లు ఆరోపణలున్నాయి. పత్తి, సోయాబీన్, మొక్కజొన్న విత్తనాల విక్రయాలు జిల్లాలో ఎక్కువగా జరుగుతున్న కారణంగా కొంతమంది వ్యాపారులు నకిలీ విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. నకిలీ విత్తనాల కారణంగా రైతులు పెద్దఎత్తున నష్టాల పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇక నకిలీ విత్తనాల అమ్మకాలపై ఉక్కుపాదం మోపేందుకు నిర్ణయించింది. ఇందులో భాగంగానే పోలీసు శాఖకు కీలక బాధ్యతలు అప్పజెప్పడంతో ఆ శాఖ ఇప్పటికే రంగంలోకి దిగింది. నిర్మల్ జిల్లాలో ఎస్పీ జానకి షర్మిల ఆధ్వర్యంలో నకిలీ విత్తనాల నిరోధానికి యాక్షన్ ప్లాన్ రూపొందించారు. నకిలీ విత్తనాల రవాణా, అమ్మకాల సమాచారాన్ని తెలుసుకునేందుకు స్పెషల్‌బ్రాంచ్ పోలీసులను సైతం రంగంలోకి దించుతున్నారు. దీంతోపాటు గ్రామాల వారీగా నకిలీవిత్తనాల సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వినూత్నంగా ఇన్‌ఫార్మర్ నెట్వర్క్‌ను కూడా పోలీసు శాఖ ఏర్పాటు చేస్తోంది. ప్రతి గ్రామంలో ఒకరిద్దరు ఇన్ ఫార్మర్లను నియమించి వారి ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోనున్నారు. ఈ ఇన్‌ఫార్మర్ల నియామకాన్ని అత్యంత రహస్యంగా చేపట్టనున్నారు. ఇన్‌ఫార్మర్ల వివరాలను గోప్యంగా ఉంచనున్నారు. అలాగే వారికి సరైన పారితోషకం కూడా అందించేందుకు పోలీసు శాఖ నిర్ణయించింది. కాగా పోలీస్ స్టేషన్‌ల వారీగా నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన పెంపొందించేందు కోసం ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టనున్నారు. సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్సైతో పాటు మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులతో ఈ అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నారు. అలాగే అక్కడి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎరువులు, విత్తనాల వ్యాపారులను కూడా ఈ సమావేశాలలో భాగస్వాములను చేయనున్నారు. ఇప్పటికే రైతులు విత్తనాల కొనుగోళ్ల కోసం సిద్ధమవుతున్నక్రమంలో ఈ చర్యలను వేగవంతం చేసేందుకు పోలీసు శాఖ కసరత్తు చేస్తోంది.

● ఇన్‌ఫార్మింగ్ నెట్వర్క్‌తో ప్రయోజనం

మొన్నటివరకు నిషేధిత మావోయిస్టుల సమాచారం, వారి కదలికలను తెలుసుకునేందుకు అమలు చేసిన ఇన్ ఫార్మింగ్ నెట్వర్క్ వ్యవస్థను పోలీసు శాఖ మరోసారి నకిలీ విత్తనాలను అడ్డుకునేందుకు తెరపైకి తెలుస్తోంది. గ్రామంలో నకిలీ విత్తనాల అమ్మకాలు, వినియోగం అలగే విత్తన దళారుల కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని ఈ ఇన్‌ఫార్మర్ల ద్వారా తెలుసుకునేందుకు పోలీసు శాఖ సిద్ధమవుతోంది. దీని కోసంగాను ఆయా గ్రామాల్లో చురుకైన యువకులను తమ ఇన్ ఫార్మర్లుగా నియమించుకోబోతోంది. ఇప్పటికే దీనికి సంబంధించిన కార్యాచరణ మొదలైనట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు. కాగా ఇన్‌ఫార్మర్లు తమకు అందిన సమాచారాన్ని పోలీసులకు చేరవేయగానే సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్సైలు ఆకస్మికంగా దాడులు జరిపి నకిలీ విత్తనాల వ్యాపారులను పట్టుకోనున్నారు. అయితే ఇన్‌ఫార్మర్ల సమాచారాన్ని అత్యంత రహస్యంగా ఉంచనున్నారు. వీరికి సంబంధించిన సమాచారం గ్రామంలోని ఏ ఒక్కరికి కూడా తెలియకుండా అత్యంత జాగ్రత్త తీసుకోబోతున్నారు. ఇన్‌ఫార్మర్లకు పోలీసుశాఖ ద్వారా రెమ్యునరేషన్ కూడా చెల్లించనున్నట్లు సమాచారం. ఈ సంవత్సరం ప్రయోగాత్మకంగా ఇన్ ఫార్మింగ్ నెట్వర్క్‌ను అమలు చేయనుండడంతో ఈ నెట్వర్క్ ద్వారా ఎంత మేరనకిలీ విత్తనాలను అడ్డుకునే అవకాశం ఉంటుందోనన్న ఆసక్తి అంతటా నెలకొంటోంది.

● సరిహద్దులలో చెక్‌పోస్టులు

నకిలీ విత్తనాలను అడ్డుకునేందుకు జిల్లా సరిహద్దుల్లో బార్డర్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసేందుకు పోలీసు శాఖ సిద్ధమవుతోంది. సారంగాపూర్ మండలంలోని స్వర్ణ, అప్పారావుపేట్ మధ్యన అలాగే భైంసా ప్రాంతంలోని బెల్‌తరోడా వద్ద ఈ చెక్‌పోస్టులను ఏర్పాటు చేయనున్నారు. దీంతోపాటు ముథోల్, తానూర్, బాసర, కుబీర్, సారంగాపూర్ మండలాలపై ప్రత్యేక నిఘా సాధించబోతున్నారు. జిల్లాలోకి నకిలీ విత్తనాలు రాకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. నకిలీని అడ్డుకునేందుకు ఆధునిక టెక్నాలజీని కూడా వినియోగించుకోవాలని పోలీసు శాఖ భావిస్తోంది. దీంతోపాటు నకిలీ విత్తనాలు అమ్మే వ్యాపారులపై పీడీ యాక్ట్ కింద కూడా కేసులు నమోదు చేయనున్నారు.



నకిలీ విత్తనాలు అరికట్టాలని సూచనలిస్తున్న కలెక్టర్ (ఫైల్)



సమావేశానికి హాజరైన అధికారులు



కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఓట్ల లెక్కింపుకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు

● ఎస్పీ జానకి షర్మిల

● కలెక్టర్‌తో కలిసి స్ట్రాంగ్ రూమ్ తనిఖీ

నిర్మల్ కల్చరల్, మే31: ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో జూన్ 4న జరుగనున్న పార్లమెంట్ ఓట్ల లెక్కింపు కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌ను నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తో కలిసి సందర్శించారు. నిర్మల్ జిల్లాలోని నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాల ఓట్లను అక్కడి పాలిటెక్నిక్ కళాశాలలో లెక్కించనున్నారు. ఈ సందర్భంగా ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ఓట్ల లెక్కింపు కీలక ఘట్టమని, కౌంటింగ్‌కు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కౌంటింగ్ కోసం వచ్చే రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలకు వాహనాల పార్కింగ్ సౌకర్యం కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద బారికేడ్ ఏర్పాటు చేయాలని, ఎంట్రీ పాస్‌లు ఉంటేనే లోనికి అనుమతించాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి నిషేధిత వస్తువులు తీసుకెళ్లకుండా చూడాలన్నారు. నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన బారికేడ్లలోకి వెళ్లేలా చూడాలన్నారు. మీడియా పాయింట్ వద్ద కౌంటింగ్ వివరాలు ప్రకటిస్తారని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బీడీ కమీషన్ రేటు రూ.4.50 పెంపు

● బీడీ కమీషన్ ఏజెంట్ల సంఘం

నిర్మల్ కల్చరల్, మే30: బీడీ పరిశ్రమలో పని చేస్తున్న కమీషన్ ఏజెంట్లకు వేయి బీడీలకు ఇస్తున్న కమీషన్ రేటుపై రూ.4.50 పెంచడానికి అంగీకారం కుదిరినట్లు బీడీ కమీషన్ ఏజెంట్ల సంఘం ప్రకటించింది. నిజామాబాద్‌లో శుక్రవారం యాజమాన్య సంఘాలతో జరిగిన చర్చల్లో ఈ ఒప్పందం కుదిరిందని రాష్ట్ర నాయకుడు రతన్ పాలివాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ నెల బకాయిలు జూలైలోగా చెల్లిస్తారని పేర్కొన్నారు. నూతన అగ్రిమెంట్ ఏప్రిల్ 2024 నుండి మార్చ్ 2026 వరకు అమలులో ఉంటుందని వెల్లడించారు.

పొగాకు వాడడం ప్రాణాంతకం

నిర్మల్ కల్చరల్, మే 31 : పొగాకు వాడకంతో ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతాయని, దాన్ని నిరోధించాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పొగాకు వ్యతిరేక దినోత్సవ సందర్భంగా సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొగాకు సేవించడంతో గుండె సంబంధిత, శ్వాసకోశ వ్యాధులు, క్యాన్సర్ వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. వీటితో మరణాలు సంభవిస్తాయన్నారు. పొగాకు వాడకం వల్ల కలిగే అనర్థాలు వివరించారు. పొగాకు నివారణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞచేశారు. కార్యక్రమంలో ఉప వైద్యాధికారి రాజేందర్, డాక్టర్ శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి వేణు రావు, లక్ష్మీకాంత్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ ధనరాజ్, సిబ్బంది

బడిబయట పిల్లలను బడిబాట పట్టించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి



బడి ఈడు పిల్లలపై అవగాహన కల్పిస్తున్న స్పెషల్ అధికారి

దిలావర్‌పూర్, మే31: బడిబయట పిల్లలను బడిబాట పట్టించేందుకు ప్రతిఒక్కరూ చొరవ తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి నర్సయ్య అన్నారు. శుక్రవారం ఎంపీపీ కార్యాలయంలో జరిగిన బడిబాట కార్యక్రమం సన్నాహక సమావేశంలో మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు పని చేస్తున్న విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలని, నిష్ణాతులైన ఉపాధ్యాయులు కలిగిన ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన జరుగుతుందన్న నమ్మకాన్ని వారికి కలిగించాలన్నారు. అధికారులందరూ సమన్వయంతో బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో అజీజ్‌ఖాన్, ఎస్‌ఐ సుమాంజలి, డిప్యూటీ తహసీల్దార్ పుష్ప, ఎంఏవో స్రవంతి, కాంప్లెక్స్ హెచ్ ఎం సదానందం, గ్రామాల ప్రత్యేక అధికారులు, జీపీ కార్యదర్శులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

సారంగాపూర్: బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని మండల స్పెషల్ అధికారి సురేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గల ఎంపీడీవో సమావేశ మందిరంలో ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. బడి బాట కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బడిబాట కార్యక్రమం జూన్ 3వ తేదీ నుండి 19వ తేదీ వరకు ఉంటుందని, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతోపాటు స్వయం సహాయక సంఘాలు, అమ్మ ఆదర్శపాఠశాల కమిటీలు తల్లిదండ్రులు గ్రామాలలో ఇంటింటా తిరుగుతూ, ప్రచారం చేస్తూ ర్యాలీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి మధుసూదన్, మండల పంచాయతీ అధికారి తిరుపతిరెడ్డి, మండల నోడల్ అధికారి జనార్ధన్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

మోడల్ స్కూల్‌కు ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల

కుంటాల, మే31: మండలకేంద్రం కుంటాల స్థానిక ఆదర్శ మోడల్ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశం కొరకు ఇటీవల పరీక్షలో పాల్గొని ఎంపికైన విద్యార్థుల జాబితాను జిల్లా విద్యాధికారి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో విడుదల చేశారు. జాబితాను పాఠశాల ఆవరణలో నోటీసు బోర్డుపై అతికించినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్ తెలిపారు. జాబితాలో పేర్లు ఉన్న విద్యార్థిని, విద్యార్థులు జూన్ 3, 4, 5 తేదీలలో ఆధార్ కార్డు, బోనఫైడ్, కుల ధ్రువీకరణ పత్రం, అప్లికేషన్ ఫారంతో కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

3న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

నిర్మల్ కల్చరల్, మే31: రాష్ట్ర అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు జూన్ 3న నిర్వహిస్తున్నట్లు తెలంగాణ అథ్లెటిక్స్ సంఘం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పద్మనాభ గౌడ్, టి.సామ్యూల్ తెలిపారు. అండర్ 8, 10, 12, 14, 16, 18, 20 బాలబాలికలు, స్త్రీ పురుషులకు పోటీలుంటాయని పేర్కొన్నారు. రన్నింగ్, జంపింగ్, త్రోస్‌లలో పోటీలుంటాయని తెలిపారు. ఎంపికైన వారు జూన్ 6, 7న హన్మకొండ జేఎన్ స్టేడియంలో జరిగేపోటీల్లో రాష్ట్రస్థాయికి అర్హత సాధిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వయసు ధ్రువపత్రాలతో ఉదయం 8:30 గంటలకు హాజరుకావాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

బడిబాటను విజయవంతం చేద్దాం

ముథోల్, మే31: బడి బాట కార్యక్రమం విజయవంతం చేద్దామని ముథోల్ మండల ప్రత్యేక అధికారి సుదర్శన్ రాథోడ్, ఎంపీడీవో రాములు పేర్కొన్నారు. మండలాభివృద్ధి కార్యాలయంలో శుక్రవారం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్లకు గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఐకేపీ సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 3 నుండి 19 వరకు జరిగే బడిబాట కార్యక్రమం విజయవంతం చేసేందుకు ఉన్నతాధికారులు నిర్దేశించిన దిశానిర్దేశం ప్రకారం ముందుకెళ్దామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు విద్యాసంవత్సరం ప్రారంభంలో జూన్ 3 నుండి 19 వరకు బడి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయుటకు సంబంధించిన షెడ్యూల్ ప్రకారం నడుచుకోవాలన్నారు. ఈ విద్యాసంవత్సరంలో డ్రాప్‌ఔట్స్ లేకుండా ప్రభుత్వ పాఠశాలలో బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించుటకు పాఠశాల ప్రధానోపాధ్యాయులతోపాటు సంబంధిత అధికారులు ప్రభుత్వ పాఠశాలల అడ్మిషన్లు పెంచేలా ప్రతిపాదనలు తయారు చేసి బడి బాటను విజయంతం చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో గుణాత్మకమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. విద్యార్థులకు ఉచిత పుస్తకాలు సైతం అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్పెషల్ అధికారులు, కార్యదర్శులు, ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ తరగతులు

● కళాశాలల్లో వసతుల లేమి.. సౌకర్యాల కరువు

● వేధిస్తున్న అధ్యాపకుల కొరత

భైంసా, మే 31: పాలకులు మారుతున్నా ప్రభుత్వ ఇంటర్ కళాశాలల తీరు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు తయారైంది. ప్రభుత్వ విద్యా వ్యవస్థను పటిష్ఠపరుస్తామని పాలకులు చెబుతున్నా ఆచరణలో విఫలమవుతున్నారనే వాదనలున్నాయి. సకాలంలో అధ్యాపకులను నియమించకపోవటంతో పాటు మౌలిక వసతులు కరవై విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

● నేటి నుంచి తరగతులు ప్రారంభం

ఇంటర్మీడియట్ కళాశాలలు శనివారం పునఃప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల వద్దకు అధ్యాపకులు వెళ్తున్నారు. ప్రభుత్వ ఇంటర్ కళాశాలల్లో విశాల తరగతి గదులు, ఆధునిక ప్రయోగశాలలు, అనుభవజ్ఞులైన బోధన సిబ్బంది, ప్రవేశంతో పాటు ఉచితంగా పాఠ్య పుస్తకాల పంపిణీ, క్రీడా మైదానం తదితర వసతులున్నాయని ప్రచారం చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా కళాశాలల్లో సమస్యలే అధికంగా ఉన్నాయి. వసతుల లేమి, సౌకర్యాల కరువుతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఫిజికల్ డైరెక్టర్ల (పీడీలు), రెగ్యులర్ అధ్యాపకుల కొరతతో పాటు మౌలిక వసతుల విషయంలో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ సమస్యలను అధిగమించేలా కలెక్టర్లు చొరవ తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



అడ్మిషన్ల కోసం ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

● ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు

కార్పోరేట్ జూనియర్ కళాశాలలు, ప్రభుత్వ గురుకుల జూనియర్ కళాశాలలున్నా ప్రభుత్వ ఇంటర్ కళాశాలలపై మోజు ఏ మాత్రం తగ్గటం లేదు. విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల బాట పడుతున్నా వసతులు, రెగ్యులర్ అధ్యాపకుల కొరత వల్ల బోధన సజావుగా సాగటం లేదనే అభిప్రాయాలున్నాయి. కొన్ని చోట్ల ప్రభుత్వ కళాశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకుంటున్నా కనీసం మరమ్మత్తులకు నోచుకోవడం లేదు. స్లాబ్‌లు దెబ్బతినడంతో వర్షాలకు తరగతి గదులు కురుస్తున్నాయి. అక్కడక్కడ ప్రహారీలు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మూత్రశాలలు లేకపోవటం వెలిసిన రంగులతో భవనాలు కళాహీనంగా దర్శనమిస్తున్నాయి. మరుగుదొడ్ల నిర్వహణకు స్కావెంజర్లు లేకపోవడంతో పారిశుధ్య సమస్యలు వెంటాడుతున్నాయి. విశ్రాంతి సమయంలో ఆటలు ఆడాలనుకుంటున్నా వ్యాయామ అధ్యాపకుల కొరత పట్టిపీడిస్తోంది. నిర్మల్‌జిల్లాలో కొత్తగా మంజూరైన కుంటాల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెగ్యులర్ ప్రిన్సిపల్, అధ్యాపకుల పోస్టులు మంజూరు చేయకపోవడం గమనార్హం.

● జిల్లాలో 12 ప్రభుత్వ కళాశాలలు

జిల్లాలో 19 మండలాలు ఉండగా, 12 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 135 రెగ్యులర్ అధ్యాపకులు, 14 మంది కాంట్రాక్టు అధ్యాపకులు, 54 మంది గెస్ట్ అధ్యాపకులు విధులు నిర్వహిస్తున్నారు. తానూర్, బాలుర జూనియర్ కళాశాల నిర్మల్, మామడ కళాశాలల్లో ప్రిన్సిపల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 12 కళాశాలల్లో నిర్మల్‌లోని బాలికల ప్రభుత్వ కళాశాలలో మాత్రమే లైబ్రేరి ఉండగా, మిగతా అన్ని కళాశాలల్లో ఈ పోస్టు ఖాళీగా ఉంది. అధిక శాతం కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్ల పోస్టులు ఖాళీగా ఉండడం కారణంగా విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు.